# బామ్మశ్రీ

ఆవకాయంటే ఇష్టంలేనిదెవరికి? ఒకప్పుడు ఎ.పి. ఆవకాయకి ప్రసిద్ధి! రాను రాను దీనిపేరు ప్రఖ్యాతులకు ఎల్లల్లేకుండా పోయినయ్. ఊరగాయల వ్యాపారం పాకాన పడడంతో ఆవకాయకి కాళ్ళొచ్చి గ్రహాంతరయానం చేసినట్టు విదేశీయానం చేసింది. ఇప్పుడు ఇతర కంట్రీస్‌లో సైతం ఆవకాయ అమ్మకం జోరుగా జరుగుతోంది.

ఆవకాయ ఊరగాయ పెట్టటమంటే ఆషామాషీ కాదు. ఆవకాయ పెట్టటంలో మా బామ్మకున్న నేర్పు ఇతరులకు లేదు. దోసకాయ పప్పు చేసినా... ఉలవచారు పెట్టాలన్నా... ఆవకాయ పెట్టాలన్నా అది ఒక్క మా బామ్మకే చాతనవుతుంది.

బామ్మపెట్టే ఆవకాయ రుచేవేరు. మరే ఇతరమైన ఆవకాయ అయినా బామ్మపెట్టే ఆవకాయకి సాటిరాదు.

అసలు... ఆవకాయ ఎన్ని రకాలుగా పెట్టచ్చో మా బామ్మకు తెలిసినంతగా ఇతరులకు తెలీదు. పెసర ఆవకాయ, ఉల్లి ఆవకాయ... టెంక ఆవకాయ... ఈ విధంగా ఎన్నో రకాలుగా ఆవకాయ పెట్టచ్చని మా బామ్మ చెప్తుంటే వినేవారు నోరెళ్ళబెట్టకతప్పదు! అహా... ఓహో... అంటూ అమ్మో ఆవకాయలో ఇన్ని రకాలుంటాయా అని హాశ్చర్యంతో ముక్కున వేలేసు కుంటారు.

ఆవకాయ పెట్టటంలో పోటీ నిర్వహిస్తే గోల్డ్ మెడల్ బామ్మకే వస్తుంది. ఆవకాయ పెట్టటంలో పి.హెచ్.డి. చేసి పట్టా పుచ్చేసుకుంది. ఓ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేటిచ్చేశారు బామ్మకి. మా బామ్మలెవలే వేరు. కాలనీలో మహిళా సమాజం వారంతా బామ్మను గౌరవంగా బామ్మశ్రీ అనే పిలుస్తారు.

ఊరగాయలు పెట్టటంలోనూ ప్రభుత్వం పద్మశ్రీలు ఇవ్వతలిస్తే... మొట్టమొదటి పద్మశ్రీ మా బామ్మకే వచ్చినట్టొస్తుంది.

బామ్మశ్రీ పేరు గిన్నిస్ బుక్‌లో కెక్కేసింది. ఆవకాయ పెట్టటంలో గల నైపుణ్యాన్ని మహిళాలోకం తెగపొగిడింది. ఆల్మోస్ట్ అన్ని టి.వి. స్టేషన్లవారు బామ్మశ్రీతో ప్రత్యేక ఇంటర్వ్యూలు నెరిపి టెలికాస్ట్ చేసారంటేనే అర్థమవుతుంది. ఆవకాయ పెట్టటంలో ఆమెకు గల ఘనతలేమిటో!

ఆవకాయ పెట్టటం గురించి ఎవరైనా నోటికొచ్చినట్టు అడ్డదిడ్డంగా వాగితే... వారిని ఉతికి ఆరేస్తుంది. తక్కున నోరు మూయిస్తుంది! అంతే!

ఒక్కసారి బామ్మచేతి ఆవకాయ తిన్నారంటే ఇక జీవితకాలంలో మరచిపోలేరు.

నేను డిగ్రీ ఫైనల్లోకొచ్చినా... వేడి వేడి అన్నంలో ఆవకాయ వేసి కలిపి ముద్దలుచేసి మా బామ్మశ్రీ నా నోటికి అందిస్తుంటే... కళ్ళు మూసుకొని నోట్లో ముద్దనములుతూ తదాత్మ్యం చెందేవాడిని!

ఒక్క పద్మశ్రీ ఏంటి?... భారతరత్న బిరుదులాగా మా బామ్మకి ఆవకాయ రత్న అనే బిరుదిచ్చి సత్కరిస్తే ఆవకాయంత అద్భుతంగా ఉంటుందంటే నమ్మండి!

ఆవకాయ గురించి అనువుగా గంటల తరబడి ఉపన్యసించగల దిట్ట మా బామ్మశ్రీ!

ఓసారి ఏమయిందంటే... సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించినట్టే... అఖిల భారత మహిళా సంఘంవారు ఢిల్లీలో ఆవకాయ తీరుతెన్నులు గురించి పోటీలు పెట్టటంతో... బామ్మ కూడా పాల్గొనడానికి అక్కడికి వెళ్ళింది. మా బామ్మ కట్టు... పర్సనాలిటీ చూచి ఈవిడగారికేం తెలుసు ఆవకాయ గురించి అని ఫకాలున నవ్వారట.

ఆడంగులంతా అలా నవ్వటంతో బామ్మశ్రీకి వళ్ళు మండింది. మాటల్తో ఏంపని?... చేతల్తో చూపుతా తడాక అనుకొని... నవ్విన నాపచేనే పండుననే సామెత మనసులో గుర్తుకు తెచ్చుకుని... తనవంతు రాగానే మైక్ ముందుకెళ్ళి నిలబడి అరగంటసేపు అనర్గళంగా ఉపన్యసించి... పోటీల్లో బెస్టే కాకుండా... ఫస్టొచ్చి బంగారు మామిడికాయ రూపులో గల ట్రోఫీని కైవసం చేసుకుని... ఆంధ్రుల ఆవకాయ ఘనత చాటింది.

సో... దటీజ్ బామ్మశ్రీ!

★★★★★

ఎనభయ్యోపడిలో సైతం వడివడిగా నడవగలదు బామ్మశ్రీ! అంటే... అంతటి ఆరోగ్య వంతురాలన్నమాట! ఇప్పటికే చక్కిలాలు... జంతికలు... బఠాణీలు పటపట నమలేస్తుందంటే ఎవరికీ నమ్మశక్యం కాదు. ఒక్క పన్నైనా వూడలేదు. కంటిచూపు తగ్గలేదు. ఇన్నేళ్ళ తన జీవితంలో ఆఖ్ఖాల్ తలనొప్పి అయినా ఎరగదు. అర్థశేరు బియ్యపు అన్నం ఈనాటికీ సులువుగా లాగించి హరాయించుకోగల జీర్ణశక్తి ఉంది.

ఇంటెడి చాకిరీ వంటి చేత్తో చేసి అవతల పారేస్తుంది. కోడళ్ళను వంటింటి ఛాయలకు రాకండి అంటూ శాసిస్తుంది.

ఈతరం వారికి ఊరగాయలు పెట్టటమే చేతనై ఏడవదు అంటూ కామెంట్ చేస్తుంది. తన శక్తిని ఎవరైనా శంకిస్తే... ఆదవడ ఈదవడ వాయించేస్తుంది.

తీరిక సమయాల్లో... అమెరికాలో ఉంటున్న మనుమలతో ముని మనుమలతో ఇంటర్‌నెట్‌లో ఛాట్ చేస్తుంది.

సెల్ ఎలా ఉపయోగించాలో నాకిప్పటికీ తెలీదు. అలాంటిది. టీ.వీ. ముందు కూర్చొని

మొబైల్లో ఎస్.ఎమ్.ఎస్.లు పంపగల తెలివి తేటలున్న మనిషి బామ్మ!

ఆవకాయ సీజనొస్తే బామ్మశ్రీ హడావుడి అంతా ఇంతా కాదు. ఎండుమిర్చి... ఆవాలు... దంపించడం... ఒకే చెట్టు మామిడికాయలు కొని తెచ్చి నీళ్ళలో కడిగి వాటిని పొడిగుడ్డతో తుడిచి కత్తిపీట ముందు కూర్చుని సరిసమానమైన రీతిలో ముక్కలుగా తరగటం... గానుగ ఆడించిన పప్పునూనె తెప్పించి... కలిపిన ఆవకాయను జాడీలకు ఎత్తడం వంటిది చేసి... కూతుళ్ళకు... మనుమరాళ్ళకు... కోడళ్ళకు... విదేశాల్లో ఉన్న మనుమలకు పంపేవరకు ఆమె నిద్రపోదు.

ఎవరైనా సరే తన బంధువర్గంలో వారిని షాపుల్లో సీసాల్లో లభించే ఊరగాయ తినవద్దని ఉచిత సలహా ఇచ్చేస్తుంది. వాటిలో ప్రిజర్వేటివ్స్ ఉంటాయని అవి ఆరోగ్యానికి చెరుపు చేస్తాయని మెడికల్ టరమ్స్‌లో మాట్లాడుతుంది.

మా కుటుంబంలో వారందరూ ముప్పొద్దులా అన్నంలో ఆవకాయ కలుపుకొని మెక్కాల్సిందే! అది లేకపోతే ముద్ద గొంతు దిగదు.

★★★★★

అమెరికాలో ఉంటున్న బామ్మ పెద్ద మనుమడు ఆమెను అక్కడికి రావలసిందిగా కోరుతూ ఫ్లైట్ టిక్కెట్ కొని కొరియర్‌లో పంపటం చూచి బామ్మశ్రీ ఎగిరి గంతేసింది. నాకైతే బామ్మ సంబరం చూచి నవ్వాగింది కాదు.

ఎందుకలా వెధవ నవ్వు నవ్వటం... అక్కుపక్షి... అంటూ నన్ను శాపనార్థాలు పెట్టింది.

విమాన ప్రయాణమంటే జట్కాబండిలో ఊళ్ళో తిరగటం కాదే బామ్మ... అందులోనూ నీకు ఇంగ్లీషు వచ్చి చావదు కదా?- ఎలా వెళ్ళగలుగుతావు!- అన్నాను.

నోర్మూయ్యరా కుర్రకుంక! నాకన్నీ తెలును మా పెత్తల్లి ఒకామె... చదువు సంధ్యా లేకపోయినా దేశానికి స్వాతంత్ర్యం రాకముందే విమానంలో ఒంటరిగా విదేశాలు తిరిగొచ్చింది ఎంచక్కా! నోరున్న దాన్ని నేను వెళ్ళిరావటం పెద్ద కష్టమేం కాదు...

బామ్మ అమెరికా వెళ్ళబోతున్నందుకు ఇంట్లో కుటుంబసభ్యులందరం ఆనందంతో చిందులేశాం.

మా డాడీ పనిచేస్తున్నది అదే ఆఫీసులో కనుక... వీసా పాస్‌పోర్ట్ చిటికెలో వచ్చేసినయ్.

ఇన్నేళ్ళలో బామ్మశ్రీ మమ్మల్ని వదలి ఎప్పుడు ఎక్కడికీ వెళ్ళలేదు. అలాంటిది... బామ్మ మాకు దూరమై విమానంలో ఎగిరి అమెరికా వెళుతుందంటే నా మటుకు నాకు మనసులో దిగులైంది.

ఆమె తిరిగొచ్చేదాకా... వెండికంచంలో... నాకు ఆవకాయ, అన్నం కలిపి... ముద్దలు చేసి నా నోటికి ఎవరు అందిస్తారు.

వెధవాయ్ నేను తిరిగొచ్చేదాకా ఎలాగో అలా నువ్వే కలుపుకొని తినేడు... నా తల నిమురుతూ అంది. నన్ను నేను సముదాయించుకున్నాను.

అమ్మా! నీతో తీసుకెళ్ళవలసినవన్నీ సర్దుకున్నట్టేనా?- మా డాడీ అడిగాడు బామ్మని.

అహా! కొత్త ఆవకాయ జాడీతోపాటు జంతికలు... కారప్పూస... చేగోడీలు... అరిసెలు అన్నీ మూటలు కట్టేశాను... హుషారుగా బామ్మ బదులిచ్చింది.

చుట్టూవున్న మా అందరికేసి... ఇక తాను తిరిగిరాదేమో... ఇదే కడసారి చూపు అనే భావనతో చూచింది. అప్రయత్నంగా బామ్మ కంటిలో నీరు తొణికిసలాడటం అందరం గమనించి బాధపడ్డాం.

అత్తవారింటికెళ్ళే ఆడపిల్లకి వీడ్కోలు ఇస్తూ సాగనంపినట్టు... కళ్ళనీళ్ళతో బామ్మకి టాటా చెప్పేశాం.

డాడీ కారు డ్రైవ్ చేస్తూ... పక్కనే వున్నవాళ్ళతో ముచ్చటిస్తూ... ఎయిర్‌పోర్ట్ చేరుకున్నాం.

బామ్మకి ధైర్యం నూరిపోస్తున్నాడు డాడీ! ఫార్మాలిటీస్ పూర్తయి... ఫ్లైట్ ఎక్కేందుకు క్యూలో నిలుచుంది బామ్మశ్రీ.

ఫ్లైట్ గాలిలోకి కైట్‌లాగా ఎగరగానే మేమంతా వెనుదిరిగి కారులో ఇంటికొచ్చేశాం.

తెల్లచీర... నెత్తిన ముసుగు ధరించిన విధవరాలైన బామ్మవైపు తోటి ప్రయాణికులలో కొందరు విస్మయంగా చూశారు.

ట్రేలో డ్రింక్స్‌తో వచ్చింది హోస్టెస్. అవేవి తనకక్కర్లేదనే భావనతో తల అడ్డంగా ఆడించింది. వెంటనే తన హేండ్ బ్యాగులో వున్న కారప్పూస పలుకులు బైటికి తీసి గుప్పిట వుంచి కొద్ది కొద్దిగా కర...కర... నమలటం మొదలు పెట్టింది బామ్మ.

బామ్మ నములుతున్నప్పుడు వస్తున్న చప్పుడుకి కోపాసింజర్స్ అదోలా ఆమె వైపు చూచినా... అది అగౌరవంగా భావించని బామ్మ మరికొంచెం శబ్దం చేస్తూ తింటూనే వుంది.

తరువాత కాస్సేపటికి నిద్రలోకి ఒరిగిపోయింది. నిద్రలేచిన చాలామంది పాచి ముఖాలతో కాఫీ తాగటం గమనించినా తాను మాత్రం టాయిలెట్స్‌కి వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకొని దంతధావనం ముగించుకొచ్చి సీట్లో కూర్చుంది.

కొద్దిగంటల ప్రయాణం తరువాత ఇంటర్‌నేషనల్ ఫ్లైట్లో చికాగో చేరింది. హమ్మయ్య మొత్తానికి గమ్యం క్షేమంగా చేరినట్టే అనుకుంటూ విమానం దిగింది.

లగేజ్... పాస్‌పోర్ట్... టిక్కెట్ వెరిఫికేషన్ సమయంలో... చెకింగ్ అఫిషియల్స్‌కి ఏం అనుమానం వచ్చిందో ఏమో బామ్మని పక్కన నిలబడమని సైగచేసి మిగతా పాసింజర్ల విషయంలో లీనమవటం గమనించిన బామ్మకు వళ్ళు మండినట్టనిపించింది.

'ఐ... అన్నపూర్ణమ్మ... ఇండియా...' అంటూ వచ్చీ రాని ఇంగ్లీషు పొడిపొడిగా మాట్లాడింది.

మరో ముగ్గురు అధికారులు అక్కడికి వచ్చారు. బామ్మ వెంటనున్న అవకాయని చెక్ చేస్తూ బ్లడ్... బ్లడ్... అంటూ కల్లు తాగిన కోతిలా చిందులేశాడు ఒక చెకింగ్ అధికారి.

అవకాయను చూచి బ్లడ్ అంటాడేమిటి వెర్రి పీనుగ అనుకుంది మనసులో.

ఎందుకైనా మంచిదన్పించి దటీజ్ అవకాయ... అవకాయ... అంటూ తెలియచెప్పింది. అక్కడున్న అధికారులకు.

వాట్ అవకాయ్?... అరిచాడు.

నీ తలకాయ్! తిక్క వెధవకు అవకాయ అంటే ఏమిటో కూడా తెలిసేడవదు. మనసులో గొణుక్కుంది.

మరొక ఆఫీసరు అందులో వేలుపెట్టి అవకాయ కారం మంటెత్తుతుందని తెలీక నాలుక మీద వేసుకున్నాడు. అదేమిటో రుచి చూద్దామని.

'మడితో పెట్టి వెంట తెచ్చుకుంటున్న అవకాయరా అది. అంట్ల వెధవ... అందులో వేళ్ళు పెట్టి చూస్తావేం?' తెలుగులో చీవాట్లు పెట్టింది.

ఇంతలో బామ్మశ్రీ మనుమడు రాజీవ్ అక్కడ ప్రత్యక్షమవటం చూచి వరేవ్... లగేజ్ చెక్‌చేసి వీళ్ళు నన్ను నానా తిప్పలు పెడుతున్నారు. అవకాయలో వేళ్ళు పెట్టాడొకడు. బ్లడ్... బ్లడ్ అంటూ చిందులేశాడు మరొకడు... వీళ్ళ అనుమానం ఏమిటో? నాకు బోధపడి చావడంలేదు... ఫిర్యాదు చేసినట్టు మాట్లాడింది బామ్మ.

రాజీవ్ అక్కడి వారితో వివరంగా మాట్లాడి వారిని ఒప్పించి... బామ్మను లగేజిని బైటకు తీసుకొచ్చాడు. మొత్తానికి ఆ రాక్షసుల బారినుండి సమయానికొచ్చి కాపాడేవుకదరా... లేకపోతే నన్ను నానా ప్రశ్నలు వేసి పీక్కుతినేవాళ్ళు... అంది కారెక్కి కూర్చొని.

నీ అవకాయ ఊరగాయ కాదుగానీ... మొత్తానికి తెల్లవారిని హడలగొట్టావ్... కారు డ్రైవ్ చేస్తూ పకపకా నవ్వాడు రాజీవ్.

బామ్మశ్రీ కూడా మనుమడి నవ్వులో శృతి కలిపింది.

- సమాప్తం -

*(చినుకు మంత్లీ, ఆగస్టు 2009 సంచిక)*